# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్ సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

- ❖ ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ❖ ప్రభుత్వం టాక్సీ డ్రైవర్లకు అండగా ఉంటుందని కేంద్ర సహకార శాఖా మంత్రి అమిత్ షా తెలిపారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉదయం 10 గంటలకు 9వ ఎడిషన్ "పరీక్ష పే చర్చ"లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో సంభాషిస్తారు.

- ❖ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెట్‌లో భాగంగా వడోదర కోటంబిలోని బీసీఏ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని లోక్ సభ మూజువాణి ఓటుతో ఈ రోజు ఆమోదించింది. భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంతో సహా వివిధ అంశాలపై ప్రతిపక్షాల ఆందోళనల కారణంగా లోక్‌సభలో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనపై స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. నిన్న సభలో ప్రతిపక్ష ఎంపీల వైఖరి కారణంగా ధన్యవాద తీర్మానంపై సమాధానం ఇవ్వడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్ సభకు రాలేకపోయారని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా లోక్ సభ ఈరోజు పలు మార్లు వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, నిన్న అధికార పక్షం బెంచీల వద్దకు చేరుకున్న ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై స్పీకర్ ఓం బిర్లా ఆందోళన వ్యక్తం చేశారు. సభ మర్యాదను కాపాడటం సభ్యులందరి బాధ్యత అని స్పష్టం చేశారు. గందరగోళ వాతావరణం మధ్యనే ఆయన సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి సమావేశమైనప్పుడు.. రాష్ట్రపతి

ప్రసంగానికి, ధన్యవాద తీర్మానంపై పలువురు ప్రతిపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన సవరణలపై స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా... వాటిని సభ తిరస్కరించింది. దాంతో ప్రతిపక్షాల గందరగోళం మధ్య లోక్‌సభ ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించింది. మూడవ వాయిదా తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకు లోక్ సభ తిరిగి సమావేశమైనప్పుడు, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ తదితర ప్రతిపక్ష పార్టీ ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. సభ మధ్యలోకి దూసుకెళ్లారు. గందరగోళం కొనసాగడంతో సభను రేపు ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లుగా స్పీకర్ ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలోని అనేక దేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారతదేశం అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ఈ రోజు జరిగిన చర్చకు ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశం ఒక పటిష్టమైన ఉత్పాదక, పర్యావరణ వ్యవస్థను నిర్మించిందన్నారు. యువ ప్రతిభావంతుల సమూహంగా భారతదేశం ఉందని గుర్తు చేశారు. సంస్కరణలతో, దార్శనికతతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. భారత్.. 9 దేశాలతో వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకుందని, ఇటీవల యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాలతో చేసుకున్న ఒప్పందం అన్నింటికన్నా పెద్దదని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం టాక్సీ డ్రైవర్లకు అండగా ఉంటుందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. దేశంలో మొదటిసారి సహకార ఆధారిత రైడ్ హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్ భారత్ టాక్సీని న్యూఢిల్లీలో అధికారికంగా ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టాక్సీ సేవల రంగంలోకి ప్రభుత్వం ప్రవేశించడం లేదని.. సహకార రంగం ద్వారా టాక్సీ డ్రైవర్లకు ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. వారి ఆదాయాలను పెంచుతుందని వారికి శ్రేయస్సును తెస్తుందని ఆయన అన్నారు. భారత్ టాక్సీ డ్రైవర్లు సంపాదించే ఛార్జీలపై ఎటువంటి కమీషన్ వసూలు చేయదని అమిత్ షా పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటులో ఏ విషయంపై నైనా చర్చించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. రాజ్యసభలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభలో అంతరాయం సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు కోరిన విధంగానే కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రకటన చేశారని జేపీ నడ్డా తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం గల్ఫ్ సహకార మండలి (GCC) న్యూఢిల్లీలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం నిబంధనలపై ఈరోజు సంతకం చేశాయి. ఢిల్లీలో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఆరు GCC దేశాలతో భారతదేశం చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కీలకమైందని చెప్పారు. భారత్, గల్ఫ్ దేశాల మధ్య ఇంధన వనరుల వృద్ధికి ఈ ఒప్పందం తోడ్పడుతుందన్నారు. అదే విధంగా భారతదేశ ఆహార ప్రాసెసింగ్, మౌలిక

సదుపాయాలు, పెట్రోకెమికల్, ICT రంగాలకు విశేష ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. ప్రస్తుతం భారత్, గల్ఫ్ దేశాల మధ్య వాణిజ్యం 170 బిలియన్ డాలర్లుగా ఉందని కేంద్రమంత్రి తెలియచేస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉదయం 10 గంటలకు 9వ ఎడిషన్ `పరీక్ష పే చర్చ`లో భాగంగా దేశవ్యాప్తంగా… విద్యార్థులతో సంభాషిస్తారు. పరీక్షల ఒత్తిడిని గురించి చర్చించడం, పరీక్షలను జీవితంలో అంతర్భాగంగా స్వీకరించడాన్ని ఈ కార్యక్రమంలో ముఖ్యంగా చర్చిస్తారు. దేవ్‌మోగ్రా, కోయంబత్తూర్, రాయ్‌పూర్, గౌవహతి, ఢిల్లీలోని 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లలోని ప్రధానమంత్రి నివాసంలో విద్యార్థులతో ఈ సమావేశాలు జరుగుతాయి. MyGov పోర్టల్ ద్వారా 4 కోట్ల 50 లక్షలకు పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఈ కార్యక్రమం కోసం నమోదు చేసుకున్నారని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమం దూరదర్శన్, ప్రధానమంత్రి యూట్యూబ్ ఛానల్ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమం వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. WAVES OTT, Amazon Prime Video, Jio, వంటి వివిధ OTT ప్లాట్‌ఫామ్‌లలో కూడా ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పధం పెంచడం పరీక్షా పే చర్చ కార్యక్రమం లక్ష్యంగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =

పర్వతారోహకులకు శారీరక బలం మాత్రమే కాదు.. ధైర్యసాహసాలు కూడా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అర్జెంటీనాలోని మౌంట్ అకాన్‌కాగువా పర్వతారోహణ యాత్రను న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుండి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఉత్తరకాశీలోని నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ పహల్గామ్‌లోని జవహర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ వింటర్ స్పోర్ట్స్ సంయుక్తంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ… దృఢ సంకల్పంతో సవాళ్లను ఎదుర్కొనేందుకు సిబ్బందిని సిద్ధం చేసినందుకు రెండు సంస్థలను ప్రశంసించారు. ఇదిలా ఉండగా మౌంట్ అకాన్‌కాగువా సముద్రమట్టానికి దాదాపు 6 వేల 960 మీటర్ల ఎత్తులో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) క్రికెట్‌లో భాగంగా వడోదర కోటంబిలోని BCA స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసింది. కాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళా జట్టు 2024లో డబ్ల్యూపీఎల్ టైటిల్ గెలుచుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ 2023, 2024 సీజన్లలో రన్నరప్‌గా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83 వేల 817 పాయింట్ల వద్ద లాభంతో ప్రారంభమై.. చివరికి 504 పాయింట్ల నష్టంతో 83 వేల 313 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =